30-04-2022 ప్రాత:మురళి ఓంశాంతి "బాప్ దాదా" మధువనం

"మధురమైన పిల్లలూ - మిమ్మల్ని జ్ఞాన-యోగాలతో అలంకరించడానికి తండ్రి వచ్చారు, ఆ అలంకారాన్ని స్థిరంగా నిలుపుకునేందుకు మాయతో ఎప్పుడూ ఓడిపోకూడదు"

ప్రశ్న:- ఏ ఒక్క చిన్న విషయము, నిశ్చయబుద్ధి పిల్లల నిశ్చయాన్ని తెంచి సంశయబుద్ధి కలవారిగా చేస్తుంది?

జవాబు:- నిశ్చయబుద్ధి పిల్లలు ఒకవేళ నడుస్తూ-నడుస్తూ, ఏదైనా చిన్న తప్పు చేసి, భ్రమలో చిక్కుకున్నట్లయితే నిశ్చయం తెగిపోతుంది. శ్రీమతంలో భ్రమ ఉత్పన్నమైతే మాయ సంశయబుద్ధి కలవారిగా చేస్తుంది. ఎవరైతే సంశయబుద్ధి కలవారిగా అవుతారో, వారు సేవ కూడా చేయలేరు మరియు వారి ద్వారా వికారాలను జయించే శ్రమ కూడా జరగదు. ఇటువంటి బలహీనమైన పిల్లలకు కూడా దయార్ద్రహృదయుడైన తండ్రి సలహాను ఇస్తారు, పిల్లలూ, ఒకవేళ మిమ్మల్ని వికారాలు విసిగిస్తే, మీరు సేవ కూడా చేయకపోతే, కనీసం తండ్రిని స్మృతి అయినా చేయండి.

గీతము:- నీవే తల్లివి-తండ్రివి... (తుమ్హీ హో మాతా పితా...)

ఓంశాంతి. ఇది ఎవరి మహిమ? తల్లి-తండ్రిది. మీరు ఆ తల్లి-తండ్రికి పిల్లలు. వారిని అనంతమైన రచయిత అని అంటారు. ఎంతమంది బ్రహ్మకుమారులు-కుమారీలు ఉన్నారు. జగదంబ మరియు జగత్పిత. బ్రహ్మ చిత్రాలు కూడా ఉన్నాయి. కేవలం భిన్న-భిన్న చిత్రాలను తయారుచేసారు. విశ్వం యొక్క ఆది అనగా సత్యయుగంలో అపారమైన సుఖముండేదని మీకు తెలుసు. ఇప్పుడు మళ్ళీ అనంతమైన తండ్రి నుండి అనంతమైన సుఖం యొక్క వారసత్వాన్ని తీసుకుంటున్నారు. ఈ మహిమ లౌకిక తల్లిదండ్రులకు ఉండజాలదు. ఇది అనంతమైన తల్లి-తండ్రి యొక్క విషయము. పరమపిత పరమాత్మనే తల్లి-తండ్రి అని అంటారు, కానీ వారు నిరాకారుడు. కొత్త రచన, కొత్త ధర్మం కోసం ఇది కొత్త జ్ఞానము అని చాలా సార్లు అర్థం చేయించారు. దేవీ-దేవతా ధర్మం ఇప్పుడు లేదు. మాది దేవీ-దేవతా ధర్మమని ఎవరూ అనరు ఎందుకంటే వారైతే సంపూర్ణ నిర్వికారులుగా ఉండేవారు. ఇప్పుడు అందరూ వికారులుగా ఉన్నారు, ఇతర ధర్మాలు తప్పకుండా ప్రాయఃలోపమవ్వాల్సిందే, అప్పుడు మళ్ళీ ఆ ధర్మాన్ని స్థాపన చేయడం కోసం తండ్రికి రావాల్సి ఉంటుంది. ఇప్పుడు పిల్లలైన మీరు తండ్రిని మరియు వారసత్వాన్ని స్మృతి చేయాలి. వారసత్వం కోసం తల్లి గర్భం నుండి జన్మ తీసుకుని, మళ్ళీ తండ్రిని స్మృతి చేస్తారు. జన్మనైతే తీసుకున్నారు కానీ ఎవరి ద్వారా? తల్లి ద్వారా జన్మ తీసుకున్నారు. ఇక్కడ కూడా అలాగే జరుగుతుంది. ఈ తల్లి ద్వారా మీరు పిల్లలుగా అయ్యారు. వారసత్వం తీసుకునేందుకు ఈ తల్లి ద్వారా శివబాబాను స్మృతి చేస్తారు. కానీ కొందరికి నిశ్చయముంది, కొందరికి లేదు. అందరికీ నిశ్చయం ఉందని కాదు. మాయ గుటకలు వేయిస్తూ ఉంటుంది. ఎక్కడో ఒక చోట చిక్కుకుపోతారు. శ్రీమతంపై నడుచుకోని వారు తమ తప్పుల భ్రమలో చిక్కుకుంటారు. నిశ్చయముంటే ఇక మిగిలిన విషయాలన్నీ వదిలేస్తారు. వినాలి మరియు వినిపించాలి. మేము సేవ చేయలేమని కొందరు అంటారు. ప్రజలను తయారుచేయకపోతే రాజుగా కూడా అవ్వరు. అచ్ఛా, ఇంకేమీ చేయడం లేదంటే, కేవలం శివబాబాను స్మృతి చేయండి. స్వర్గంలోకి వచ్చేస్తారు. అచ్ఛా, వికారాలను జయించేందుకు శ్రమ చేయలేకపోయినా కూడా, తండ్రిని స్మృతి చేసినట్లయితే స్వర్గంలోకి వచ్చేస్తారు, కానీ తక్కువ పదవి లభిస్తుంది.

తండ్రి అర్థం చేయిస్తారు, భక్తి పాత్ర ఇప్పుడు సమాప్తమవ్వనున్నది. భక్తి యొక్క ఫలాన్ని ఇచ్చేందుకు తండ్రి వచ్చారు. మీరే నంబరువారుగా పూర్తి భక్తి చేస్తారు. మొట్టమొదట శివబాబాది చేస్తారు, తర్వాత బ్రహ్మ, విష్ణు, శంకరులది. ఇప్పుడైతే చూడండి వీధి-వీధిలోనూ ఎన్ని మందిరాలు తయారుచేసారు, ఎన్ని సత్సంగాలు జరుగుతూ ఉంటాయి. ఎక్కడైతే ఇవన్నీ ఎక్కువగా ఉన్నాయో, అక్కడ మళ్ళీ ఇవేవీ ఉండవు. ఒక్క మందిరం కూడా ఉండదు. ఇప్పుడైతే భక్తి సామాగ్రి ఎంతగా ఉంది. ద్వాపర-కలియుగాలు భక్తి మార్గపు యుగాలు. తమోప్రధానంగా అయ్యే యుగాలు. ఇప్పుడు తండ్రి ఈ జంజాటాలన్నింటి నుండి విడిపిస్తారు. చెడు వినకండి, చెడు చూడకండి... దేహసహితంగా వీటన్నింటి నుండి మమకారాన్ని తొలగించండి అని అంటారు. ఇప్పుడు మీరు కొత్త ఇంట్లోకి వెళ్ళాలి. ఎప్పుడైతే స్థాపన జరుగుతుందో, అప్పుడే వెళ్తారు కదా - ఇది పాత ప్రపంచము, దుఃఖధామము. ఇది అంతిమ జన్మ. ఇప్పుడు మీరు ఈశ్వరుని ఒడిలో కూర్చున్నారు. తల్లి-తండ్రి యొక్క ఒడిలో ఉన్నారు. నియమానుసారంగా, తండ్రి బ్రహ్మ ముఖం ద్వారా మీకు జన్మనిస్తారు, కావున వీరు తల్లి అయ్యారు కానీ మీ బుద్ధి శివబాబా వైపుకు వెళ్ళిపోతుంది. మీరు తల్లి-తండ్రి, మేము

మీ పిల్లలము... శివబాబా వైపు మీ ప్రేమ వెళ్తుంది. మీరు ప్రేయసులు కూడా. శివబాబా వచ్చారు, మిమ్మల్ని అలంకరించి యోగ్యులుగా చేయడానికి. జ్ఞానము మరియు యోగముతో పిల్లలైన మిమ్మల్ని అలంకరిస్తారు. కేవలం మీరే కాదు, ఈ వాణిని అన్ని సెంటర్లలోనూ వింటారు. వేలాది మంది వింటూ ఉంటారు. అందరి అలంకరణ జరుగుతూ ఉంటుంది. ఎంతమంది అలంకరణ చేసుకుంటూ-చేసుకుంటూ మళ్ళీ మురికిగా అయిపోతారు. బాబా గాడిద ఉదాహరణను ఇస్తారు కదా. పిల్లలైన మీరు సర్వగుణ సంపన్నులుగా, 16 కళల సంపూర్ణులుగా... అవ్వాలి. ఘడియ-ఘడియ మాయతో ఓడిపోకూడదు. బాబా, ఈ రోజు మాయ చెంపదెబ్బ వేసింది అని అంటారు. బాబా అంటారు, మీరు కులానికి కళంకాన్ని తెచ్చేవారు. తండ్రిని కూడా నిందింపజేస్తారు, అలాగే పిల్లలను కూడా నిందింపజేస్తారు. మీరు ఇంకా కింద పడిపోతారు. ఈ కామము మహాశత్రువుపైన పూర్తిగా విజయం పొందాలి. తండ్రితో ప్రతిజ్ఞ చేయవలసి ఉంటుంది. తండ్రి స్వర్గానికి రచయిత కనుక తప్పకుండా స్వర్గానికి యజమానులుగా చేస్తారు. ఎవరైతే ఈ సహజ రాజయోగాన్ని నేర్చుకుంటారో, వారే స్వర్గంలోకి వస్తారు. అందరూ స్వర్గంలోకి వస్తారని కాదు. కొత్త ప్రపంచాన్ని గాడ్ ఫాదర్ రచిస్తారనైతే అర్థం చేసుకుంటారు. ఇకపోతే కొత్త ప్రపంచంలో ఎవరు రాజ్యం చేస్తారు, ఈ రహస్యాన్ని ఎవరైనా అర్థం చేయిస్తేనే తెలుస్తుంది. భారత్ ప్రాచీనమైనదని తెలిసినా కానీ యథార్థ రీతిగా స్వయంగా భారతవాసులకే తెలియనప్పుడు, ఇతరులకు ఏం చెప్తారు. మీరు చెప్పవచ్చు, భారత్ వంటి పవిత్ర ఖండము ఇంకేదీ ఉండజాలదు. భారత్ వంటి సమృద్ధి ఖండము ఇంకేదీ ఉండదు. ఇప్పుడు అమెరికా మొదలైనవారి వద్దనైతే చాలా ధనముంది కానీ భారత్ తో పోల్చి చూస్తే అది గవ్వలతో సమానమైనది. భారత్ యే అన్ని ధర్మాలకు తీర్థ స్థానము. ఆత్మలందరికీ తండ్రి భారత్ లోనే వస్తారు, నరకాన్ని స్వర్గంగా చేస్తారు, అందరికీ ముక్తినిస్తారు. మహిమంతా వారిదే. పుష్పాలు కూడా వారికే అర్పించాలి. కానీ గీతలో పేరును మాయం చేసారు, అందుకే మహత్వాన్ని తగ్గించేసారు. క్రిస్టియన్లు తప్పుడు మాటలు విన్నారు, కనుక వారు కూడా నిందింపజేసే విషయాలను వినిపించి తమ ధర్మంలోకి చాలామందిని కన్వర్ట్ చేస్తూ వెళ్ళారు. ఎంత మంది క్రిస్టియన్లుగా అవుతూ ఉండవచ్చు. ఇదైతే కల్ప-కల్పము జరుగుతూనే ఉంటుంది. తండ్రి అంటారు, ఎప్పుడైతే అలా ధర్మగ్లాని జరుగుతుందో, అప్పుడు నేను మళ్ళీ వచ్చి భారత్ ను వజ్రతుల్యంగా చేస్తాను. అనంతమైన తండ్రి నుండి అనంతమైన సుఖం లభిస్తుంది. స్వర్గ స్థాపన జరుగుతుంది. వారు శివబాబా. మీరు శివశక్తి, భారతమాతలు మరియు మీరు గుప్తంగా ఉన్నారు. శివశక్తి సైన్యమైన మీ గురించి మనుష్యులకు ఏం తెలుసు. తప్పకుండా మనం శివశక్తి పాండవ సైన్యమని మీకే తెలుసు. ఈ కొత్త రాజధాని స్థాపన జరుగుతూ ఉంది. ఇది పాత పతిత ప్రపంచము, అది పావన కొత్త ప్రపంచము. ఈ పతిత ప్రపంచంలో పావనంగా ఎవ్వరూ ఉండజాలరు. శాస్త్రాలలో ఏమేమి విషయాలు రాసేసారు. వినిపించేవారు కూడా చాలా తెలివైనవారిగా ఉంటారు. శాస్త్రాలు కూడా వింటూ వచ్చారు, ఏడు రోజులు పఠనమును కూడా జరుపుతూ వచ్చారు. రుద్ర యజ్ఞము మొదలైనవి కూడా రచిస్తూ వచ్చారు. ఎన్ని చేసినా ప్రపంచం తమోప్రధానంగా అవ్వాల్సిందే. ఏమి చేసినా కానీ, తిరిగి అయితే ఒక్కరు కూడా వెళ్ళలేరు. మనుష్యులకు జ్ఞానం లేదు కనుక శాస్త్రాలలో ఉన్న చెవులకు ఇంపు కలిగించే విషయాలు చాలా మంచిగా అనిపిస్తాయి. ఇప్పుడు మీకు అవి మంచిగా అనిపించవు. కావున తండ్రి అంటారు - చెడు వినకండి... కేవలం నన్నే స్మృతి చేయండి. శ్రీమతంపై నడుచుకుంటే శ్రేష్ఠంగా అవుతారు. ఆసురీ మతంపై నడుచుకోవడం వలన అసురులుగా అవుతూ ఉంటారు. అది రావణ మతము. మనుష్యులు రావణ మతంపై ఉన్నారు, అందుకే రావణుడిని కాలుస్తూ ఉంటారు. తండ్రి ప్రతి విషయాన్ని మంచి రీతిగా కూర్చొని అర్థం చేయిస్తారు. బీజము మరియు వృక్షం యొక్క జ్ఞానం ఉంది, దీనిని కల్పవృక్షం అని అంటారు. దీని ఆయుష్షు 5 వేల సంవత్సరాలు. ఒకవేళ సత్యయుగం లక్షల సంవత్సరాలు ఉన్నట్లయితే, మరి హిందువులు లెక్క లేనంతమంది ఉండాలి కదా.

ఇప్పుడు పిల్లలైన మీరు మంచి రీతిలో తెలుసుకున్నారు, వినాశనమైతే జరగాల్సిందే, ప్రకృతి వైపరీత్యాలు కూడా వస్తూ ఉంటాయి, వీటిని భగవంతుడు కలిగించిన విపత్తులు అని వారు అంటారు. కానీ భగవంతుడు ఏమైనా విపత్తులను కలిగిస్తారా ఏమిటి. ఇదైతే డ్రామాలో రచించబడి ఉంది. వినాశనం జరగకపోతే కొత్త ప్రపంచం ఎలా రచించబడుతుంది. మహాభారత యుద్ధం ద్వారానే ద్వారాలు తెరుచుకుంటాయి. పిల్లలు సాక్షాత్కారాన్ని పొందారు, గమ్యము చాలా గొప్పది. కనుక చాలా మంది ధైర్యం చేయరు. చూడండి, నిన్న కూడా బాబా అర్థం చేయించారు, ఈ మృత్యులోకంలో ఇది మీ అంతిమ జన్మ. ఇప్పుడు నేను అమరలోకానికి యజమానులుగా చేయడానికి వచ్చాను. ఈ అంతిమ జన్మలో తండ్రి చెప్పింది వినండి. పవిత్రత యొక్క ప్రతిజ్ఞ చేయండి. లౌకిక తండ్రి కూడా, ఒకవేళ కుమారుడు మాట వినకపోతే, నీవు కుపుత్రుడవు అని తండ్రి అంటారు కదా. బాబా అయితే సర్వశక్తివంతుడు, వారి ఆజ్ఞపై నడుచుకుంటే సహాయం కూడా లభిస్తుంది. కానీ పిల్లలు, అచ్ఛా ఆలోచిస్తాము అని అంటారు. అరే, రేపే శరీరాన్ని విడిచిపెట్టినట్లయితే వారసత్వం లభించదు. 5 వికారాల వ్యాధి చాలా కఠినమైనది. మాయ అందరినీ రోగులుగా చేసింది. ఇప్పుడు తండ్రి అంటారు, నా

శ్రీమతంపై నడుచుకోండి. మాయ చాలా వికల్పాలలోకి తీసుకొస్తుంది, చాలా తుఫానులు వస్తాయి. దివాలా తీస్తారు. ఆ తర్వాత అంటారు, ఇదేమిటి, బాబాకు చెందినవారిగా అయిన తర్వాత ఈ పరిస్థితి ఏర్పడింది! కానీ తండ్రి అంటారు, మీరు శివబాబాకు సర్వస్వాన్ని ఇచ్చేసారు, మీరైతే ట్రస్టీలుగా అయిపోయారు, వారు మీకు పూర్తి లెక్కను ఇచ్చేస్తారు. మీరెందుకు చింతిస్తారు.

ఇప్పుడు భారత్ యొక్క నావ మునిగిపోయి ఉందని, తండ్రి రక్షించడానికి వచ్చారని మీకు తెలుసు. తండ్రి తప్ప స్వర్గాన్ని ఇంకెవరు తయారుచేస్తారు. ద్వారిక కిందకు వెళ్ళిపోయిందని అంటారు, ఇప్పుడు పైకి ఎలా వస్తుంది. చేపలు, తాబేళ్ళు తెస్తాయా ఏమిటి? ఇది డ్రామా యొక్క చక్రము, దీనిని అర్థం చేసుకోవాలి. సత్య-త్రేతాయుగాలు ఎప్పుడైతే పైన ఉంటాయో, అప్పుడు ద్వాపర-కలియుగాలు కిందకు వెళ్ళిపోతాయి. ఎలాగైతే అద్దాన్ని ఫుల్ సైజుగా కూడా తయారుచేస్తారో, అలా సృష్టి చక్రం యొక్క చిత్రాన్ని అంత పెద్దదిగా తయారుచేయాలి. తండ్రి అంటారు, పిల్లలూ, అద్దంలో మీ ముఖాన్ని చూసుకుంటూ ఉండండి, ఎక్కడా కోతి వలె అవ్వడం లేదు కదా! ఎవరిలోనైతే వికారాలు ఉంటాయో, వారు కోతుల కన్నా కూడా హీనమైనవారు. దేవతలైతే మందిరయోగ్యంగా ఉంటారు. వాస్తవానికి సన్యాసులకు ఎప్పుడూ మందిరాలను నిర్మించడం జరగదు. మందిరాలు కేవలం దేవతలకే ఉంటాయి. ఎందుకంటే వారి ఆత్మ మరియు శరీరం రెండూ పవిత్రంగా ఉంటాయి. ఇక్కడ పవిత్ర శరీరమైతే లభించజాలదు. మనుష్యులు ఎన్ని యజ్ఞాలు రచిస్తారు, కథలు వింటూ ఉంటారు. తండ్రి అయితే ఒకే అనంతమైన యజ్ఞాన్ని రచిస్తారు, దానిని రుద్ర యజ్ఞమని అంటారు. ఈ యజ్ఞం ద్వారానే వినాశ జ్వాల ప్రజ్వలితమవుతుంది. మిగిలిన యజ్ఞాలన్నీ సమాప్తమైపోతాయి. రుద్ర జ్ఞాన యజ్ఞము ప్రసిద్ధమైనది. శివ జ్ఞాన యజ్ఞము ప్రసిద్ధము కాదు. రుద్రునికి మరియు సాలిగ్రామాలకు పూజ జరుగుతుంది. ఎన్ని సాలిగ్రామాలను తయారుచేస్తారు. శివలింగమైతే ఒక్కటే తయారుచేస్తారు. ప్రజలైతే చాలామంది తయారవుతారు. అన్ని సాలిగ్రామాలను ఏమైనా తయారుచేయగలరా. శివబాబా మరియు పిల్లలైన మీకు పూజ జరుగుతుంది. ఎందుకంటే మీరు మొత్తం ప్రపంచమంతటికీ విముక్తిని కలిగిస్తారు. మీరు శివశక్తులు - ముక్తిదళము. స్వయాన్ని సర్వోదయ లీడర్ అని చెప్పుకునేవారు చాలామంది ఉన్నారు. అప్పుడు మొత్తం ప్రపంచంపైన దయ అయితే ఎవ్వరూ చూపించలేరు. అందరిపైన దయ చూపించేవారు అని, దయార్ద్రహృదయుడైన శివబాబానే అంటారు. మనుష్యులు పేర్లు అయితే పెద్ద-పెద్దవి పెట్టించుకుంటారు. సర్వులపై దయ లేదా కృప చూపించడము అనగా సుఖధామానికి తీసుకువెళ్ళడము - ఈ పని అయితే ఒక్క పరమాత్మదే. అందరికీ గతి సద్గతిదాత, ఒక్క శివబాబానే. మనుష్యులు ఎవ్వరికీ సద్గతిని చేయలేరు. ఒక్కరిది కూడా చేయలేరు, అసంభవము. మిమ్మల్ని అంటారు, మీరు శాస్త్రాలను ఒప్పుకోరు కానీ ఏ వస్తువైతే ఎదురుగా ఉందో, కళ్ళతో చూస్తామో, ఎలా ఒప్పుకోకుండా ఉంటాము, కానీ ఇప్పుడు మేము శ్రీమతంపై నడుచుకుంటున్నాము. దీని ద్వారా శ్రేష్ఠంగా అవుతాము. శ్రీమతము భగవంతునిది, శ్రీకృష్ణుని మతంపై నడుచుకోము. కృష్ణుడి యొక్క ఆత్మ కూడా మునుపటి జన్మలో శ్రీమతం ద్వారా ఈ విధంగా శ్రేష్ఠ దేవతగా అయ్యింది. తతత్వమ్. వారి రాజధాని కూడా ఉంటుంది కదా. ఒంటరిగా కృష్ణుడు ఏం చేస్తారు! ముళ్ళ నుండి పుష్పాలుగా తండ్రి తప్ప ఇంకెవరూ తయారుచేయలేరు. తండ్రి వచ్చారు కనుక తప్పకుండా స్వర్గాన్ని రచిస్తారు కదా లేదంటే అవతారం తీసుకోవాల్సిన అవసరమేముంది. తప్పకుండా భారత్ ను స్వర్గంగా తయారుచేసారు మరియు ఇప్పుడు మళ్ళీ తయారుచేస్తున్నారు. అక్కడ కూడా మందిరాలు మొదలైనవి ఉండవు. మీకు తెలుసు, బాబా భారత్ లోనే వచ్చారు, భారత్ ను స్వర్గంగా తయారుచేయడానికి. బాబా అర్థం చేయించారు మాయా తుఫానులైతే అందరికీ వస్తాయి, బాబాను వచ్చి అడగండి. జ్ఞానము మరియు యోగము యొక్క అనుభవాన్ని కూడా అడగండి. సంకల్పాలు ఏవైతే వికల్పాలుగా అయిపోతాయో, వాటి అనుభవం కూడా అడగండి. బాబా అందరికన్నా ముందు ఉన్నారు. కావున ఈ తుఫానులను తప్పకుండా దాటి వెళ్తారు. మనం బాబాను స్మృతి చేస్తాము. అయినా కూడా మాయ తక్కువేమీ కాదు. ఎంత రుస్తుంగా ఉంటారో, అంతగా మాయ పూర్తిగా ఎదుర్కొంటుంది, భయపడకూడదు. బాబా, విసిగించవద్దని మాయకు చెప్పండి అని రాస్తారు, కానీ మాయ తుఫాన్లు అయితే తీసుకొస్తుంది, భయపడకూడదు. అచ్ఛా!

మధురాతి మధురమైన సికీలధే పిల్లలకు మాత-పిత, బాప్ దాదాల ప్రియస్మృతులు మరియు గుడ్ మార్నింగ్. ఆత్మిక పిల్లలకు ఆత్మిక తండ్రి నమస్తే.

ధారణ కొరకు ముఖ్య సారము:-

1. తండ్రికి పూర్తి లెక్కను ఇచ్చి, ట్రస్టీలుగా అయి అన్ని చింతల నుండి ముక్తులవ్వాలి. తండ్రి ఆజ్ఞపై పూర్తి-పూర్తిగా

నడుచుకొని సహాయానికి పాత్రులుగా అవ్వాలి.

2. మనుష్యుల మునిగిపోయి ఉన్న నావను, ముక్తిదళంగా అయి, తీరానికి చేర్చాలి. తండ్రికి సహాయకులుగా అయి పూజ్యనీయ యోగ్యులుగా అవ్వాలి.

వరదానము:- ప్రతి సెకండు, ప్రతి ఖజానాను సఫలం చేసి సఫలత యొక్క సంతోషాన్ని అనుభవం చేసే సఫలతామూర్త భవ

సఫలతా మూర్తిగా అవ్వడానికి విశేష సాధనము - ప్రతి సెకండును, ప్రతి శ్వాసను, ప్రతి ఖజానాను సఫలం చేయడము. ఒకవేళ సంకల్పము, మాట, కర్మ, సంబంధ-సంపర్కాలలో అన్ని రకాల సఫలతను అనుభవం చేయాలనుకుంటే, సఫలం చేస్తూ వెళ్ళండి, వ్యర్థమవ్వకూడదు. స్వయం పట్లనైనా సఫలం చేయండి, ఇతర ఆత్మల పట్లనైనా సఫలం చేయండి, అప్పుడు స్వతహాగానే సఫలత యొక్క సంతోషాన్ని అనుభవం చేస్తూ ఉంటారు ఎందుకంటే సఫలం చేయడము అనగా వర్తమానంలో సఫలతను ప్రాప్తి చేసుకోవడము మరియు భవిష్యత్తు కోసము జమ చేసుకోవడము.

స్లోగన్:- ఎప్పుడైతే సంకల్పంలో కూడా ఎటువంటి ఆకర్షణ ఆకర్షించదో, అప్పుడు సంపూర్ణతకు సమీపంగా ఉన్నారని అంటారు.